



# ఆక్రోశం

ఆడెపు లక్ష్మీపతి

స్తబ్ధంగావున్న గాలి వుండి వుండి ఉయ్యాలలోని చంటిపాప నిద్రలో ఉలిక్కిపడ్డట్టుగా చలిస్తోంది. అలా చలిస్తున్నప్పుడల్లా రైలు కూత సన్నగా అలలు అలలుగా తేలి వస్తోంది. వెంకటి చేస్తున్న పని ఆపి గడ్డపారను నిలిపాడు.

నుదుటిమీద అరచెయ్యిని ఏటవాలుగా ఆనించి, కళ్లు మిటకరించి తూర్పుదిశకు వంతెన మీదికి దృష్టి సారించాడు. దూరాన వాగు, దాని విశాలమైన ఇరువొడ్డులను కలుపుతున్న వంతెనమీద పొద్దు బారెడు పైకెక్కింది. ఆకాశంలో మోదుగు పూరంగు వలయాలు క్రమంగా విస్తరించుకుంటూ నారింజపండు రంగును సంతరించుకుంటున్నాయి. అంబటివేళ దాటి పోతున్నదన్న మాట.

వెంకటి కళ్లు చికిలించుకుని చూశాడు. గబగబా పాకుతున్న జెర్రిపోతులాగా రైలుబండి పరిగెడుతూ వంతెనను దాటి తాటితోపులో ప్రవేశించి క్రమంగా కనుమరుగయ్యింది. 'శానా పొద్దయ్యిందే... ఇయ్యాల బండి బాగా లేటయ్యింది,' అనుకున్నాడు స్వగతంగా. నడుముకు చుట్టివున్న పంచె విప్పి చెమట తుడుచుకున్నాడు. తను ఇప్పటివరకు చేస్తున్న పని- గడ్డివామినీ చొప్పగడ్డనూ కలిపి చుట్టూరా వేస్తున్న ముళ్లకంచె పని ఎంతవరకు వచ్చిందా అని ఓసారి పరిశీలించి చూశాడు.

ఇంకా ఎంత కైవారం కంచె నాటాల్సి వుందో ఎప్పటికి పూర్తవుతుందోనని గడ్డివామి వేపూ ఆ పక్కన్నే పేర్చివున్న ముళ్లకంప-తుమ్మ పొరుకవేపూ మార్చి మార్చి చూసి మనసులో బేరీజు వేసుకుని 'పొద్దుగూకీటాల్ల కన్నా ఇయ్యాలయెన్గు పనికానియ్యాలె,' అనుకున్నాడు.

అప్పుడే 'అంబా' అంటూ ఆవు అరిచింది. గడ్డివాము దగ్గర్నుండి స్పష్టంగా కనబడుతున్న తన ఇంటినీ దాన్ని ఆనుకుని వున్న పశువుల కొట్టాన్నీ చూశాడు వెంకటి. కొట్టంలోని పశువులు తమ మేతకు వేళయిందని సూచన అందిస్తున్నాయన్నమాట! విడిచిన బండి దగ్గర ఎడ్లు అప్పటిదాకా తింటున్న కొద్దిపాటి గడ్డి అయిపోవడంతో ఆశగా వాముకేసి చూస్తూ మోరలుసాచి తోకలు విసుర్తున్నాయి. "ఏహే... నీ యవ్వ... మీ ఆకలి పాడుగాను- ఇకపొండి మేత మెక్కి కొట్టంల నెమరేద్దురు గాని..." అన్నాడు చిరుకోపంతో వెంకటి ఎడ్ల నుద్దేశించి. ఔను మరి... శ్రమించి అలిసిసొలసిన వాటికి తిండివేళయింది. ఆ మాటకొస్తే తనకు మాత్రం ఆకలి కడుపులో కరకరమనడం లేదూ?

చాలా పొద్దుపోయినట్టనిపించింది. పని వాయిదా వేసి కదిలాడు వెంకటి. ఎడ్లను బండికి పూన్చి అదిలించాడు. అవి ఒక్క పరుగులో ఇల్లు చేరుకున్నాయి. ఆ వూళ్లోని అందరి ఇండ్లలాగానే వెంకటిదీ పాతకాలపు పెంకుటిల్లు. ఆ ఇల్లు తూర్పు మూలవాసానికి పగ్గం పెట్టు దూరంలో తాతలనాటి పెద్ద చింతచెట్టు అన్ని దిశలకూ విస్తరించుకుపోయిన కొమ్మలతో గంభీరంగా నిలబడి వుంది. ఇల్లూ, వాకిలీ, కొట్టమూ- ఇవన్నీ విశాలమైన దాని నీడలో ఒదిగిపోయినాయి.

వెంకటి కొట్టంలోకి ప్రవేశించి కోడె ఆవు దూడల సరసన వాటికి కేటాయించిన స్థలంలో ఎడ్లను కట్టివేశాడు. అన్ని పశువులకూ మేత వేశాడు. పెద్ద నీళ్లతొట్టి నింపాడు. అప్పటిదాకా చిన్నగా రంకెలు వేస్తుండిన కోడె ఆవురావురుమని మేతకుపక్రమించింది. ఆవు అరుపులు మాని తృప్తిగా నెమరేస్తూంటే దూడ దాని

చుట్టూతా తిరుగుతూ తనే తింటున్నంత సంబరంగా గంతులు వేసింది.

ఇంటి తాళం తీశాడు వెంకటి. గుప్పుమంటూ అదో రకమైన ముక్క ముక్కగా ధాన్యపువాసన మొఖాన్ని తాకింది. విశాలమైన ఇల్లు. ఏ సామాను లేకుండా తలుపులు లేకుండా నాలుగు గదులున్నాయి అదనంగా ఇంటిలో. వాటిల్లో తెల్లజొన్న, మొక్కజొన్న ధాన్యం, ఆఖరి దాంట్లో కొత్తగా నూర్చిన వడ్లు రాశిగా పోసి వున్నాయి. ధాన్యపు వాసన వెంకటికి కమ్మగ అనిపించి, దీర్ఘశ్వాసతో ఆఘ్రాణించాడు.

పశువులకు పిండిపెట్టి, ఆవుకు కుడితి కలిపాడు. ముద్దు ముద్దుగా మూతి చాపుతున్న దూడను దగ్గరికి తీసుకుని ప్రేమగా కలిపాడు. ముద్దుముద్దుగా వుండాల్సిన పశువులన్నీ వున్నాయి. ఒక్క గేదె తప్ప. ఆఖరు మోకు దగ్గర ఉత్త పలుపు వేళ్లాడుతోంది. పొద్దున్నే పశువుల కాపరి గేదెను కొట్టంలోంచి విడిచి మందలోకి తోలుకు పోయినట్టుగా అర్థమయింది వెంకటికి. తన భార్య పార్వతమ్మ వేళ ప్రకారం పిండి పెట్టమనీ, గేదెను జాగ్రత్తగా స్వయంగా మందలోకి తోలియ్యమనీ... ఏవేవో చెప్పింది. ఇంటి దగ్గర ఇన్ని వ్యవసాయపనులు, పశువులకు సంబంధించిన బాధ్యతలు వదలివెళ్లడం గురించి బెంగగా వున్నా తప్పని పరిస్థితయి పార్వతమ్మ తన కూతురి అత్తవారింటికి వెళ్లవలసి వచ్చింది.

ఇంతలో పోచమ్మ కుడివైపు నుండి కుక్కలు ఒక్క సారిగా భౌభౌమని మొరుగుతున్న సవ్వడి వినవచ్చింది. ఊళ్లోకి ఎవరన్నా కొత్తవాళ్లు వచ్చినప్పుడుగానీ, సంచార జాతులను చూసినప్పుడుగానీ, పరాయి కుక్కలు లేదా అపరిచిత జంతువులు కన పడ్డప్పుడుగానీ ఊరకుక్కలు సహజంగా చేసే అలజడి అది. కుక్కలు మరింత రౌద్రంగా మొరిగాయి. ప్రతిస్పందనగా ఎదుటి పక్షంలోని కుక్కలూ మొరిగాయి. కాని ఆ మొరుగుడు పీలగా సాగదీసినట్టుగా వుంది. ఎదుటి దాడికోసం కాకుండా కేవలం తమ రక్షణ కొరకే చేస్తున్న ఘోషలాగా వుంది. రెండు నిముషాల్లో కుక్కల అరుపులు మరింత దగ్గరయినాయి. తన ఇంటివేపే వస్తున్నాయి. లేవబోయినవాడల్లా అలాగే ఆగిపోయాడు వెంకటి.

వీధి మలుపు తిరిగి శారదకాండ్ల బృందమొకటి వెంకటి ఇంటి ముందాగింది. బృందంలో ఇద్దరు మగ వాళ్లు, ఇద్దరు ఆడవాళ్లు, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మగవాళ్లల్లో యువకుడు బరువైన బట్టలు, బోళ్లు, చాపలు ధాన్యపు మూటలు వేలాడదీసిన బరువైన కావడి భుజాన మోస్తున్నాడు. రెండోవాడు ముసలివాడు. తంబూరలాంటి వాయిద్యాన్ని వాయిస్తూ, జానపద బాణీలో, బుర్రకథలాంటి రాగంతో పదాలల్లుతూ వీరరసగాథ నొకదాన్ని పాడుతున్నాడు. వాడి భార్య బుడిగే (డోలులాంటి వాయిద్యం) లయబద్ధంగా వాయిస్తూ, భర్త రాగానికి శృతి కలుపుతోంది. నోటితో తాళం వేస్తోంది. పడుచుపిల్ల- వాళ్లకోడలు- వీపున పిల్లాడిని వేళ్లాడేసుకుని రెండు చేతులకు పని అప్పజెప్పి ఈత కమ్మలతో చాప అల్లుతోంది. వెంట వున్న పిల్ల వాండ్ల చేతుల్లో సత్తుగిన్నెలున్నాయి. వాటిల్లో ఏవో ఆహార పదార్థాలున్నాయి. శారదకాండ్లనూ, వాళ్ల పెంపుడు కుక్కలను చూసి ఊరకుక్కలు మొరుగుతూ మీదమీద పడి కరవబోతున్నాయి. పడుచువాడు కావడి దించి, బూతులు తిడుతూ రాయి విసిరి ఊరకుక్కలను తరిమాడు.

పాడుతున్న కథకు విరామమిచ్చి శారదకాండ్ల బృందంలోని ముసలి వాడన్నాడు, ‘‘వెంకటయ్య పటేలా, దండాలు బాంచను.’’

ఊళ్లో పటేళ్లు, పట్వార్లు, ఇంకా ఎందరో కామందులు వున్నారు. వాళ్లతో పోలిస్తే వెంకటి బక్కరైతు. అయితే శారదకాండ్లు తమ యాచక స్వభావరీత్యా అందర్నీ ‘పటేలా’ అనిగానీ ‘దొరా’ అనిగానీ ‘అయ్యగారూ’ అనిగానీ సంబోధించడం పరిపాటి.

‘‘ఏమిరా పోశమల్లూ, బాగున్నారా?’’ కుశల ప్రశ్న వేశాడు వెంకటి.

‘‘ఆ... గిట్లున్నం బాంచను. ఏం బాగు. మీ దయ తోటి బతికేటోళ్లం...’’ అన్నాడు పోశమల్లు బృందంలోని ముసలివాడు.

‘‘వారీ పోశమల్లూ! అందరి బతుకూ గట్లనే వున్నది. మాకు ఎంత లేకున్నా వేరేటోళ్లను అడుగుకోలేం. మీరు మాత్రం కాలమెట్లున్నా ధైర్యంగా అడుక్కుంటారు. మీ బతుకే నయ్యంరా!’’

‘‘అయ్యయ్యో గట్లంటవేంది పటేలా? మీరెక్కడ? మేమెక్కడ? ఊళ్లూళ్లూ తిరిగి అడుక్కు తినెటోళ్లం మేం. ఇండ్లు లెవ్వు. బూములు లెవ్వు. సర్కార్లు మారుతానయి. మాకొరకు ఏందేందో కొత్త ఇస్కీమ్‌లు వత్తున్నాయంటారు. అయినా మా బతుకులు ఎక్కడేసిన గొంగడి గక్కన్నే అన్నట్టున్నాయ్. ఓట్లప్పుడు కూడా మమ్ముల పట్టించుకోరు. గంతెందుకు? మా కింతవరకు రాషను కారట్లు లేవు...’’

బీడి కట్టలోంచి రెండు బీడీలు పోశమల్లు వాళ్ల కేసి విసిరి, "సరేగాని... గిట్ల బయలెల్లింగ్రు? వచ్చిన పనేందో చెప్పుంగ్రి," అన్నాడు వెంకటి.

"ఏమున్నది బాంచను. మా కులపోళ్లమంతా వూళ్లు పంచుకున్నాం. నాకు ఈ దాపుల ఊళ్లు వచ్చి నయ్. గందుకనే వచ్చిన బాంచను. కోతలయితానయ్ కద! కల్లాల కాడ అడుక్కుంటాన్నం. మీ కుప్పలు... నిన్ననే జారగొట్టింగ్రటకద. దొరా, నీకాల్మొక్తా.... అడ్డె డన్ని గింజలు పొయ్యుంగ్రి బాంచను..." ప్రార్థిస్తు న్నట్టుగా అన్నాడు పోచమల్లు.

"వారీ పోశమల్లూ, మీరు గింతగనం అడగా ల్నారా? నేను నిరుడూ, ఆ ముందటేడూ మీరు అడిగి నన్ని గింజలు పొయ్యలేదా, కాలం మంచిగుంటె నేను? పంటకు గదేందో పురుగు తాకింది. దానియవ్వ... ఎన్ని మందులు పోసినా సావలేదు. రెండెకరాల పొలంల రెండు పుట్లు కూడా రాలేదురా వడ్లు. ఏం జెప్పెట ట్లుంది... ఏం చూసుకోవాలన్నా, ఎటు ఉర్కాలన్నా, ఎటు మెసలాలన్నా ఇద్దరమెనాయె... నేనూ, నా పెండ్లాం. చేతికింద ఎవరు లేకుంట అయిపాయె. మా బతుకుల బండపడె...." అన్నాడు వెంకటి.

సమాధానపడ్డట్టుగా పోశమల్లు ముఖంలో రంగులు మారాయి. మెల్లగా అన్నాడు. "ఔను బాంచను. నీ సంగతి దెల్వదా. నీవు మహారాజసోంటో నివి. మునుపెన్నడూ గిట్లగాకపాయ. ఎటు సూసుకోవా లన్నా నువ్వూ, పార్వతవ్వ దొరసానేనాయె! పాపం ఆ దేవునసోంటి పొల్లగాడు సత్తయ్య గిట్లయిపాయె. లోకం కండ్లల్ల మన్ను జల్ల."

టక్కున ఆగాడు వెంకటి. శూన్యంలోకి చూస్తూ ఆలోచనలోపడ్డాడు. తన కొడుకు సత్తయ్య. ఒక్కగా నొక్క కొడుకు 'పోయి' అప్పుడే రెండేళ్లు గడిచాయి. బతికుంటే వానికిప్పుడు యిరవై రెండేళ్లు వయసు వచ్చేది. చెట్టంత కొడుకు పోయాక ఎంత భారంగా గడిచిందీ కాలం?

వెంకటికి సత్తయ్య రూపం కళ్లముందు మెది లింది. కొడుకు తనలాగే పొడగరి. ఎండనక, చలనక కాయకష్టం చేసిన వొళ్లు కండలు తిరిగి వుండేది. స్కూల్లో జరిగిన ఆటల పోటీల్లో ఎన్నో బహుమానాలు గెల్చుకున్నాడు. స్కూలు మాస్టారు ఎన్నోసార్లన్నాడు. అతడికి తగిన ఉద్యోగం మిలిటరీ సర్వీసు లేదా పోలీసు నౌకరీ అని. సత్తయ్య విరామ సమయాల్లో స్నేహితు లతో సరదాగా తిరిగేవాడు. అర్ధరాత్రి వేళప్పుడే నిర్భయం గా పొలం దగ్గరికెళ్లి, మోకాలి లోతు బురదలో జమ్ము కొట్టేవాడు. వేరుశనగ పంటలప్పుడు మునిముసి చీకట్లో కంచె చుట్టూ తిరుగాడే ఎలుగుబంట్లనూ, అడివి పందులనూ వడిశెల విసిరి తరిమేసేవాడు.

శారదకాండ్ల ముసల్ది వెంకటి ఇంటి నలువైపులా పరికించి చూసి బిగ్గరగా పిలిచింది. "అవ్వా పార్వతవ్వ దొరసానీ! దయగల తల్లీ... దా బాంచన్. నీ సల్లని సేయి తోటి నీకు తోచినన్ని గింజలు మా జోలెలో పోసి పో... నీకీతాప మనమడు పుడతాడు..."

"ఆమె లేదు. బిడ్డ దగ్గర్కి పోయింది. ఉండుంగ్రి. నేనే కొలిశిపోస్త. మానెడన్ని వడ్లు. అడ్డెడన్ని మక్కజొండ్లు తీసుకపోండి..." అని వెంకటి ఇంట్లోకి నడిచి ధాన్యం కొలిచాడు. అమితానందంతో జోలె పట్టింది ముసల్ది.

"నేను మళ్లీ చెప్తున్న దొరా! మీకీతాప మనుమడు పుడుతాడు. నీ బిడ్డకు మల్సూరి కానుపు మగపిల్లా డయితడు. మనుమణ్ణి దెచ్చి సాదుకోండి... రంధి పడ కుంగ్రి. మీ కన్నాయం జేసినోళ్లకు మీ గోస, ఉసురు తాకుతది. బగవంతుడు మిమ్ముల సల్లగ సూత్తాడు. బెమ్మంగారు జెప్పినట్టు పాపం చేసినోళ్లు నెత్తురు కక్కు కుని సత్తారు. పున్యాత్ములే లోకంమీద వుంటారు... ఇగ పోతం బాంచన్. మీ కాల్మొక్త..."

పొగడ్తలు, దీవెనలు, ఓదార్పులు- అన్నీ కలిపి సంకీర్తనలాగా పాడింది ముసల్ది. పడుచువాడు కావడి భుజానికెత్తుకున్నాడు. బృందం కదిలి బండ్ల బాట వేపుగా సాగింది. కుక్కల మొరుగుడు దూరమయింది.

కొడుకు గురించి జ్ఞాపకాలు ముప్పిరిగొనగా అనా సక్తయోగంలో పడిపోయాడు వెంకటి. అలాగే రోలు మీద కూలబడ్డాడు. తలకు కొరివి పెట్టేవాళ్లు లేకుండా నిర్వంశమైపోయింది కుటుంబం - నిస్సారమైపోయింది బ్రతుకు!

సత్తయ్య తమ పేటలోని వాళ్లందరికీ తలలోని నాలుకవలె మెదిలేవాడు. యువకులను కూడగట్టి 'సంగం' పెట్టాడు. నీటి పంపకం విషయంలో, శిస్తుల లెక్క విషయంలో, వ్యవసాయాధికారులకు రైతు సమస్యల గురించి విన్నపాలు రాయడంలో, రోడ్ల మరమ్మత్తు గురించీ కరెంటు కోత గురించీ... ఇలా ఎన్నో గ్రామీణ విషయాల మీద అందరికీ సలహాలిచ్చి పేటనంతటినీ ఒక్క తాటిమీద నడిపించాడు. కొడుకు అందరి నోళ్లల్లో 'మంచోడు' అని నానుతున్నందుకు వెంకటి మనస్సులో చాలా ఆనందించాడు. కాని ఒక రోజు ఊరి సర్పంచూ, ఆ ప్రాంతపు ఎమ్మెల్యేకు

బామ్మర్దీ అయినటువంటి అచ్యుతరావు, ''వారీ వెంకటీ, ఈ కాలపు పోరగాండ్లకు బొత్తిగా మర్యాదా వినయమూ లేకుండా పోయినయిరా. నాలుగక్షరం ముక్కలు నేర్చుకోంగనే పెద్ద వకీళ్లయినట్టుగా మాట్లాడుతున్నారు. పెద్దమనుషులు ఎదురుంగ వస్తే నిలబడుడు లేదు - నమస్తే జెప్పుడు లేదు. మీ పేటలోని పోరగండ్లంతా కల్సి ఏదో సంగం గట్టింఱ్రట కద. దానికి మీ వోడు సత్తిగాడు లీడరట కదా? అయితే మానె... సంగం పెట్టుకోని- కాని మాతో కయ్యాలు పెట్టుకోవద్దని జెప్పు. వాడు బుద్ధిగ సదువుకుని పైకొస్తే మేము గూడ ఆనందిస్తం గదరా.... గందుకనె... యెగ్రియెగ్రి యేషాలేసి పాడుగావద్దని జెప్పు. మిడిసి మిడిసి పడద్దని జెప్పు మీవోనికి...'' అని నిలేసి అడిగినప్పుడు వెంకటి కుంగిపోయాడు. కొద్దిగా భయపడ్డాడు కూడా.

కొడుకుకు సలహా ఇచ్చాడు- ''మన మానాన మనం బతకాలె బిడ్డా... మనం గరీబోళ్లం. దొరలతోటి పేచీలు పెట్టుకోవద్దు. ఆళ్లు గొప్పోళ్లు...'' అని.

దానికి కొడుకన్నాడు. ''దొరలు దొరతనాలు పోయినై. జమీందార్ల జమానా మట్టిలో కలిసిపోయింది. దొర వస్తాండు అంటె చెప్పులు సేత పట్టుకుని నిలబడె కాలం కాదిది. ఇది ప్రజలరాజ్యం. ఒకడు మరోడికి బానిసకాడు. అందరికీ సమాన హక్కులున్నాయి. పెద్ద మనుషులంతా కలిసి ఊరిని దోసుకు తింటూంటే చూసుకుంట ఊకోవాల్నా? గ్రామీణక్రాంతి పథకం పేరిట మంజూరయిన నిధులను ఎమ్మెల్యే, అతని బామ్మర్దీ కలిసి స్వాహా చేశారు. రోడ్లు పోయించినట్లు దొంగ కంట్రాక్టు బిల్లులు చూపెడుతున్నారు. రోడ్డు కోసం శ్రమదానం చేసింది ఊళ్లో వాళ్లందరమూ కాదా? మరి సర్కారు సొమ్మును వాడబ్బ సొమ్మని ఎందుకు మెక్కాలె? రక్షిత మంచినీటి పథకం కోసం వసూలైన చందాలు మాయమయినై. నాసిరకం బోరింగులు చిలుంపట్టి ఊడిపోతున్నాయ్. ఇదంతా మోసమని నిలదీస్తున్నాం. పై అధికారులకూ, కలెక్టరుకూ ఫిర్యాదులు రాసినందుకు వాల్లకు మామీద మంట. మనం న్యాయం కోసం అడుగుతున్నాం- మనకెందుకు భయం?''

కొడుకు చెప్పిన మాటలు, సబబుగా అనిపించినప్పటికినీ వెంకటి మనసులో కొద్దిగా భయం గూడు కట్టుకుంది- మరోమారు కొడుకు గురించి పెద్ద మనుషులు హెచ్చరించేసరికి.

మరికొన్నాళ్లకు వానాకాలం పంటలప్పుడు ఊళ్లో చిన్న తగాదా జరిగింది. పూర్వాశ్రమంలో దొరతనం వెలిగించిన ప్రముఖులు కైకూలీ జనాన్ని ముందుగా తమ పొలాల్లోని వరికోతలకు రమ్మని ఆజ్ఞాపించారు. పాత కూలీరేట్లకు రామనీ తమకు నచ్చిన చోటికి పనికి వెళ్లే హక్కుందనీ కూలిజనం తిరస్కరించారు. సత్తయ్యా, మిగతా యువజనులు కూలీజనానికి అండగా నిలబడ్డారు. కోపించిన ప్రముఖులు ప్రతీకారంగా- ఎప్పటి నుండో తాతముత్తాతల నుండి మార్గాలుగా చలామణి అవుతున్న బాటలను మూసి, ''ఈ తోవలు బందు, ఇవి మా పొలాలు. మీ బండ్లు ఎక్కడ్నించయినా పోనీండి. మా భూములు అంటుకునే వీల్లేదు,'' అని విచిత్రమైన పేచీ లేవనెత్తారు. మరో మార్గం లేదు- ఒకవైపు వాగు. మరోవైపు బురదకాలువలు. బండ్లు వెళ్లె వీలులేదు. సంగం యువకులు 'ఇదేం అన్యాయం?' అని ఎదురు తిరిగారు. పెద్దల కిరాయి మనుషులకూ, యువకులకూ, లాఠీలతో తలపడేంతగా ఘర్షణ పెరిగింది. రైతులు తమ వాళ్లను వారించారు. 'ఆనవాయితీగా వస్తున్న పద్ధతులు కావంటె మాకేదీ దిక్కు,' అని పెద్ద మనుషులను బ్రతిమాలుకున్నారు. కుర్రవాళ్లది ఉడుకు రక్తం కోపగించుకోకండి అని అనునయంగా మాట్లాడారు. అంతటితో చిక్కు విడింది.

మార్గాలు తెరుచుకున్నాయి. ఆరోజే వెంకటి కొడుకును ఆఖరుసారి చూడడం- అదేరోజు రాత్రి సత్తయ్య వెళ్లాడు. మళ్లీ తిరిగి రాలేదు.

ఉన్నట్టుండి- కోసిన జొన్నచేనులో, పేర్చిన గడ్డి వాముకు ఉత్తరంగా మోటబావి వేపు నుండి పిట్టలు 'గ్రీకురు... గ్రీకురు' మంటూ రొదపెట్టనారంభించడంతో వెంకటి వర్తమానంలోకి వచ్చాడు. ఆ దిక్కుగా- కొమ్మలు నరకబడి బోసిగా కనబడుతున్న తుమ్మచెట్లు దిశగా చూశాడతడు. చెరువు కింది పొలాల నుండి సాగిన బండ్లబాట స్పష్టంగా కనబడుతోంది. బాటమీది నుండి ఎడ్ల బండొకటి పోతోంది. కరకరమంటూ రాళ్ల మీదుగా ఆ తర్వాత కీచుమని సన్నని ఇసుకమీదుగా చక్రాలు తిరిగి, బాటకు ఇరువైపులా గుబురుగా కమ్ముకున్న వావిలిచెట్ల గుంపును దాటి బండి ప్రత్యక్షమయింది. వడ్లతో నిండిన బోరెం కట్టిన బండిని భారంగా లాగుతున్న ఎడ్లు మరింత సమీపంలోకొచ్చాయి. నొగల్ల మీద నిలబడి ఎడ్లను అదిలిస్తున్న వ్యక్తిని ఆనవాలు పట్టాడు వెంకటి. అతడు రామస్వామి. అల్లంత దూరం నుండే రామస్వామి వెంకటిని చూశాడు. పగ్గాల్లాగి బండిని కుడివేపు మలిపి, చేను మీదుగా అడ్డత్రోవన వెంకటి ఇంటివేపు నడిపించాడు.

''ఏమోయీ రామసామీ! దారితప్పి ఇటు వస్తు న్నట్టున్నవ్,'' అని పలకరించాడు వెంకటి.

''లేదు. యెంకటయ్య బావా! దారి సూసుకునే వస్తాను,'' బదులిచ్చాడు రామసామి.

''మంచిది. దా... దా... కూకో,'' అని ఆహ్వానించి, నులక మంచంవాల్చి, దానిమీద గొంగడి పరిచాడు. రామసామి బండిని అలాగె నిలిపి, ముల్లుగట్టె చేతుల్లో వుంచుకుని దిగి వచ్చి మంచం మీద కూర్చున్నాడు. అతడికి వెంకటి బీడీ అందించి ఇద్దరివీ వెలిగించాడు. రామసామి పొగ వదుల్తూ, ''కల్లం కాడ్నించి వడ్లన్నీ జారగొట్టినట్టేనా బావా?'' అని అడిగాడు.

''ఔనోయి. మాదెంతసేపు? నిన్నరాత్రి వడ్లు జార గొట్టిన, గడ్డి ఇయ్యాల పొద్దుగాల ఇంటికి దెచ్చిన. ముసి ముసి సీకట్లనే లేచి మూడు మాట్ల బండి గట్టెటాలకు పనయిపోయింది.''

''గందుకేనా, మారాజు తీరుగ కాళ్లు జాపి కూకున్నవ్.''

''ఎక్కడ కూకుండెటట్టు వున్నదోయి. దొంగగొడ్లు పాడుగాను- ఇటే తిరుగుతానయ్. గడ్డీ, సొప్పా దక్కే టట్టు లేవు. గందుకనే యెన్గు పని మొదలుపెట్టిన. ఇయాల పూరాగా కానిస్తా.''

''ఇంట్ల ఏ అలికిడి లేదు. పార్వతక్క ఎటుపో యింది?''

''యేగిలివారంగనే బండి గట్టి ఆమెను జమ్మి కుంట బస్సు ఎక్కించిన. అటెంకనే కల్లం పనిజేసు కున్నా. ఆమె ఇప్పుడు కొల్లూరులో అమృతవ్వ అత్తగా రింట్లో చేరుకొనుంటది.''

ప్రశ్నార్థకంగా చూసి తరువాత ఏదో స్ఫురించిన వాడిలాగా నేలకు తల వాల్చాడు రామసామి. ''ఔను గాదు బావ. అమృతవ్వకు ఇప్పుడు పొద్దులు అన్న సంగతి మరిచేపోయిన. ఏందో బావా, అందరమూ ఒక ఊళ్లె ఉన్నట్టెగాని ఒకరి కట్టసుకం మరొకరు దెల్సుకో కుంట గాబట్టె. ఎవ్వళ్ల పనులల్ల వాళ్లముంటిమి గద. మేము గంతమందిమి కల్సి సేసుకుంటున్నా ఇండ్లళ్ల ఆడోళ్లకు, మొగోళ్లకు ఊపిరి తిరుగతలేదు, రికాము దొరుకుత లేదు.'' కొంచెం బాధపడుతున్నవాడిలా అన్నాడు.

రామసామి వయసులో వెంకటి కన్నా చిన్న. మనిషి దిట్టంగా, బలిష్టంగా ఉన్నాడు. అతనికి ఇద్దరు తమ్ముళ్లు ఉన్నారు. పెళ్లిళ్లూ, పిల్లలూ అయింతర్వాత కూడా అన్నదమ్ములు విడిపోలేదు. అంతా ఉమ్మడి కుటుంబం. నాలుగు నాగళ్ల భూమిని కలిసే చేసు కుంటున్నారు.

''పార్వతక్క మళ్లీ ఎప్పుడొస్తదో? చెయ్యేందుకు కాల్సుకుంటవ్ బావా? మా యింటికొచ్చి అన్నం తిందు వురా,'' అన్నాడు రామసామి వెంకటి ముఖంలోకి చూస్తూ. కళ్లు పీక్కుపోయి అసలు వయసుకన్నా పదేళ్లు ఎక్కువగా కనబడుతున్నాడు వెంకటి.

''పొద్దుగాలనే వంట చేసింది. ఈరోజుకు తక్లీబు లేదు. ఎల్లుండి వస్తనంది మీ అక్క. రేపటి సంగతి అటెంక సూద్దాంలే...''

కొన్ని నిముషాలు ఇద్దరూ నిశ్శబ్దంగా వున్నారు. పొద్దు వాలిపోతున్నది. రామసామి మనసులో ఒక మాట పెట్టుకుని వచ్చాడు. అది వెంకటికి త్వరగా చెప్పేసి వెళ్లిపోవడానికి నిశ్చయించుకున్నాడు.

''మళ్ల వచ్చే సోమారం ఓరంగల్లుకు బోయె పను న్నది బావా. నువ్వు రావాలె మా తోటి.''

''ఎందుకోయీ? అడితీలో గింజల రేట్లు కనుక్కు నేందుకా?'' ప్రశ్నించాడు వెంకటి. వడ్లకు ఇప్పుడు ఎలాగూ రేటు పలకదు. మూడు నెల్ల నుండి ముక్కు తున్న అరవై బస్తాల మొక్కజొన్నలకయినా ధర వస్తే అమ్ముదామన్న ఆశతో వున్నాడు వెంకటి.

''ఊహు... గందుగ్గాదు. మా తమ్ముళ్లు వేరు పడదామంటున్నారు. ఎప్పట్నుంచో ఈ ముచ్చట ఆడోళ్ల మనసుల్ల వున్నది... ఇగ ఇండ్లు, జాగాల లెక్కలు కానియ్యాలే. వేరుపడే లోపల బిడ్డ లగ్గం జెయ్యమని మా నాయన అన్నాడు. మా మామగూడ అదే మాట న్నాడు. మా బామ్మర్ది రెండు మూడు సమ్మందాలు సోల్తి పట్టుకచ్చిండు. ఓరంగల్లు కాడ ఓ పిల్లగాడున్నాడట. ఉజ్జోగమున్నదట. దొరింపయితే ఈ యేడు సుశీలకు లగ్గం జేస్తా...''

''మరి సుశీల ఏమంటాంది?''

''ఏంది బావా, ఇచిత్రంగా మాట్లాడుతున్నావ్? పోయినేడు మంకుపట్టు పట్టింది పిచ్చిపిల్ల. ఎదిగిన పోరిని ఎన్ని రోజులని ఇంట్ల వుంచుకునేది? ఏదో మనకు శని తాకినట్టయి మనమనుకున్నట్టు కాకపాయె. జరిగింది మర్సిపోవాలె. ఈ యేడు సుశీలకు లగ్గం జేసుడు ఖాయం.''

వెంకటి నోరు మెదిపి ఔను అనలేదు, కాదు అన లేదు. రామసామి చెప్పిందానికి మౌనంగా తలూపాడు.

''గది సంగతి. సోమారం ఎటూబోకు. నీతోటి అయిదుగురం అయితానం. పిల్లగాడి తలిదండ్రులతో

మాటా ముచ్చటా అయింతర్వాత యిడెం బెట్టుడు. మంచి రోజులుంటె వచ్చే నెలే లగ్గం పెట్టిద్దాం...'' అని లేచాడు రామసామి. ''ఇగ పోయొస్త.''

మంచంమీద వెల్లకిలా వాలి మబ్బుల్లోకి చూడ నారంభించాడు వెంకటి. చింతచెట్టు కొమ్మల్లోంచి ఆకాశం జల్లెడలా కనిపిస్తోంది. తన జీవితంలోని మధుర స్మృతులన్నీ జారిపోతూ, గుండెకు నిరంతరం గరుకుగా తాకే బండరాళ్లు మాత్రమే మిగులుతున్న ట్టుగా తోచింది. సుశీల... చక్కనిచుక్క. జింకపిల్లలాంటి చలాకీపిల్ల. సత్తయ్యను ఎంతగానో ప్రేమించింది, ఎన్నో కలలు కంది. ఇద్దరికీ ఈడూజోడూ సరిపోయిందనీ, జంట చిలకాగోరింకల్లాగా వుంటారనీ ఊరంతా ఆశీర్వ దించారు. ఇప్పుడు ఆ పిల్ల- తన ఇంటి కోడలు కావా ల్సిన పిల్ల- పరాయి సొత్తు కాబోతుంది.

ఇంటికప్పు మీద చింతకొమ్మలు చెదరగొట్టిన గూనపెంకులు అలాగే శిథిలావస్థలో వున్నాయి. పార్వతమ్మ ఏనాడో చెప్పింది- కిందికి వంగిన కొమ్మ లను నరికెయ్యాలనీ, లేకపోతే కప్పు అంతా పాడయి పోతుందనీ. అయితే వెంకటి ఆ పనిని వాయిదా వేశాడు, కొడుకు పెళ్లి దృష్టిలో వుంచుకుని. పార్వతమ్మకు సత్తయ్య తర్వాత మూడేళ్లకు అమృత పుట్టింది. ఆమె వెనుక ఇద్దరు పుట్టిపోయారు. అమృతకు పదహారో ఏట మంచి సంబంధం చూసి పెళ్లి చేశాడు వెంకటి. ఆమె ఇప్పుడు రెండేళ్ల పాపను చంకనెత్తుకుని, మరో పాపను నేడో రేపో ఒడిలోకి తీసుకోబోతోంది. కూతురికి పెళ్లి చేసిన మూడేళ్లకు కొడుకు పెళ్లి కూడా చెయ్యాలను కున్నాడు వెంకటి. అప్పటికి సత్తయ్య ఇంటర్మీడియెట్ చదువు పూర్తిచేశాడు. సుశీలకు మనసిచ్చాడు.

సుశీల సత్తయ్యను అమాయకంగా ఆరాధిం చింది. బీరపాదు చాటు నుండి సైగచేసి పిలిచేది. ఊసులు చెప్పుకుంటూ తన వెంట తెచ్చిన తినుబండా రాలు తినిపించేది సత్తయ్యకు. బతుకమ్మ పండుగలకు కొనుక్కొచ్చిన కొత్త బట్టలను ముందు అతనికి చూపెట్టి ఎలా వున్నాయని అడిగేది. పట్నంలోకి కొత్త సినిమా వచ్చినప్పుడు వెంకటి ఇంటికి వచ్చి, 'అత్తా, అత్తా బావ ఏడి?' అని పార్వతమ్మను అడుగుతూ కాలుగాలిన పిల్లిలా తిరుగుతుండేది. ''ఏందే పిల్లా, లగ్గం కాక మునుపే నా కొడుకును సినిమాలకు లేవదీసుకుపోతా నావ్? ఇదేం సోద్యమే? వద్దు గీతొవ్వలు మర్చిపో. ఎక్కువ సోపతి ముదిరిపోనియ్యన్నేను. వాడు- సత్తి గాడు రేపో మాపో మిలిట్రీలకు పోయ్యేటోడు. దేశం గాని దేశాలు పట్టి పోతడు. వానితోటి నువ్వేం సుకపడ తావె యెర్రిపిల్లా? మీ నాయినలు నీకు బంగారమ సొంటి పొల్లగాడ్ని సర్కారు నౌకరీ చేసేటోన్ని, బగ్గ సదూకున్నోన్ని చూసి లగ్గం చేత్తరు. మావోన్ని మర్చిపో.''

అప్పుడు సుశీల అంది- ''అత్తా మళ్లగట్ల మాట్లా డితే నా మీద ఒట్టు. నాకు మనువంటూ అయితే సత్తయ్య బావతోటె... అంతే!''

అలా అని కొడుకు చెయ్యి పుచ్చుకుని తుర్రు మంటూ పరుగెత్తుతూండిన సుశీలను చూసి భార్యతో అన్నాడు అదే సందర్భంలో వెంకటి- ''ఇగ వీళ్లను గిట్ల విడిచిపెట్టద్దు. జెప్పన లగ్గంజేసి కట్టిపడెయ్యాలె,'' అని.

''అట్లనే నువ్వు రోజూ అంటున్న చింత కొమ్మ లను ఆల్సిం జెయ్యకుండా నరికిస్త... పెండ్లినాడు వంట చెరుకుగా పనికివస్తయి. ఇల్లు కూడా సవరియ్యాలే.''

గుండెలో కలుక్కుమంది వెంకటికి. కొడుకు పోయిన ఆ రాత్రి, కాళరాత్రి గుర్తుకువచ్చి వెన్ను జలద రించింది.

కోతలప్పుడు జరిగిన తగాదా సద్దుమణిగి కోతలు సజావుగా సాగినై. తండ్రీ కొడుకులు తమ పొలం దగ్గర వరికుప్పలకు కాపలాగా పండుకున్నారు. శీతాకాలం రాత్రి గొంగడి ముసుగులో ఆదమరిచి నిద్ర పోతున్న వాళ్లను మఫ్టీలో ఉన్న పోలీసులు తట్టిలేపారు.

''సత్తయ్య అంటె వీడేనా ముసలోడా?''

''నా కొడుకు బాంచను. ఏమయింది? ఎందుకు?''

''సర్కిల్ సాబ్ రమ్మంటున్నాడు. టౌనుకు తోలుకపోతం''

సత్తయ్యను జీపులో ఎక్కించుకుకని పోలీసులు వెళ్లిపోయారు. మర్నాడు వెంకటి స్కూలు మాస్టారును తోడు తీసుకుని ఠానాకు వెళ్లాడు. అక్కడి పోలీసులు సత్తయ్యను వరంగల్లుకు తీసుకువెళ్లారని చెప్పారు. అక్కడికి పరుగెత్తాడు వెంకటి. అక్కణ్ణుంచి మరోచోటికి- గాభరాపడ్డ పక్షిలాగా తిరిగాడు వెంకటి. కొడుకు ఆచూకీ దొరకలేదు. గుండెలు బాదుకుని అధికారులతో మొర పెట్టుకున్నాడు. వకీళ్ల సహాయం కోరాడు. మాస్టారు మిత్రుడయిన లాయరు ఒకాయన సానుభూతి చూపి కేసు విచారించాడు. యస్పీ ఆఫీసు నుండి బదులు వచ్చింది. గ్రామంలో ఉద్రిక్త పరిస్థితుల కారణంగా కొందరిని అదుపులోకి తీసుకోవడం జరిగిందనీ, ఆ మర్నాడే అందర్నీ విడుదల చేశామనీ, సత్తయ్య విడు దలయ్యాడనీ, అయితే అతడు కనిపించడం లేదంటె

‘తప్పిపోయిన’ కేసుగా చర్యలు తీసుకుంటామనీ దాని సారాంశం.

పది రోజుల తర్వాత కాకతీయ కాలువలో కుళ్లిన దశలో వున్న ఓ శవం తేలుకుంటూ రావడం గ్రామస్థుల కంటబడింది. శవం ఒడ్డూ పొడుగూ సత్తయ్య పోలికలకు సరిపోయాయి. పిచ్చిపట్టినవారిలా ఆక్రోశించారు వెంకటి దంపతులు.

ప్రజాస్వామ్య హక్కుల వేదికకు చెందిన మేధావులూ, పాత్రికేయులూ జోక్యం చేసుకున్నారు. నిస్సందేహంగా సత్తయ్యది లాకప్ మరణమనీ, విచారణ అడ్డుకునేందుకు పోలీసు డిపార్టుమెంటు పాడుతున్న సరికొత్త రాగం ఈ ‘మిస్సింగ్ శైలి’ అనీ నిందించారు. వాస్తవాలు వెలికితీయాలనీ, దోషులను శిక్షించాలనీ పత్రికాముఖంగా డిమాండ్ చేశారు. ప్రభుత్వ స్పందన ఎలా వున్నాకానీ- ఈ దేశంలో జరుగుతున్న అసంఖ్యాకమైన అక్రమాలకు సంబంధించిన పొలికేకల్లాగే- ఇదీ కాలగర్భంలో కలిసిపోయింది.

ప్రస్తుతం వెంకటికి బాధ- గుండెలోని బాధ కన్నుల్లోకి ఎగిజిమ్ముకొచ్చింది. అతడిప్పుడు చంటిపిల్లాడిలా వెక్కివెక్కి ఏడ్వడానికి నిర్ణయించుకున్నాడు. బోర్లా పడుకుని గొంగడిలో ముఖం దాచుకున్నాడు. ఎన్నడూ లేనంతగా ఈ రోజు దుఃఖం పొర్లిపొర్లి వచ్చింది.

అంతలో దభేలుమన్న చప్పుడు వినివచ్చింది. తల ఎత్తాడు వెంకటి. చుట్టూ కలయజూశాడు. అంతా మామూలుగానే వుంది. మళ్లీ వచ్చింది శబ్దం. చెవులు రిక్కించాడు. కుండలు దొర్లినట్లూ, గిన్నెలు బోర్లించినట్టూ తన ఇంటి లోపల్నుండే వస్తున్నాయి చప్పుళ్లు.

లేచి కొట్టంలోకి చూశాడు వెంకటి. పశువులన్నీ యథాస్థానంలోనే వున్నాయి. నడిచి, బార్లా తెరచివున్న దర్వాజాగుండా ఇంట్లోకి ప్రవేశించాడు. అన్ని గదులూ పరికించాడు. పిల్లి మ్యావు మ్యావు మంటూ దండెం మీది నుంచి దూలం మీదికి దుముకి పారిపోయింది. ఎలుకలు మొగురం వెంబడి కిచకిచమంటూ పరిగెత్తాయి. మొగురం మీద మేకులకు వేళ్లాడుతున్న ఫోటోలు కిటకిటమన్నాయి. కొడుకు ఫోటో దగ్గర క్షణంసేపు నిలబడ్డాడు వెంకటి.

వంటగదిలో ముంత పగిలిన చప్పుడు వెంకటిని అటు లాగింది.

గదంతా చిందరవందరగా ఉంది. అన్నం గిన్నె, కూరగిన్నె దాదాపు ఖాళీగా పడి దొర్లుతున్నాయి. కొన్ని పదార్థాలు నేలమీద పడి వున్నాయి. ఉట్టిమీది పెరుగు ముంతను కిందపడేసి పెరుగునంతా నాకేస్తోంది ఒక కుక్క.

వెంకటిని చూడగానే తను చేస్తున్న పని ఆపి, దోషిలాగా నిశ్చలంగా నిలబడింది కుక్క. తీక్షణమైన అతడి చూపులతో చూపులు కలపలేక ప్రక్కదారి పట్టి గోడవారగా నడిచింది పారిపోయేందుకు.

ఉల్లిగడ్డలు, చింతపులుసు చిక్కగా వేసి భర్త కోసం ఎండుచేపలకూర చేసిపోయింది పార్వతమ్మ. కూరవాసన కమ్మగా, ఘాటుగా ముక్కుపుటాల్ని తాకే సరికి పొద్దుటినుండి తానేమీ తినలేదన్న సంగతి గుర్తుకు వచ్చి వెంకటికి కడుపులో ఘోష మొదలయింది. కాని ఇప్పుడు ఏముంది? అన్నం, పెరుగూ, కూరా అన్నీ ఈ కుక్క- పరాన్నభుక్కూ, దిక్కుమాలినదీ అయిన ఈ ఊరకుక్క అంతా మెక్కేసింది!

వెంకటి చేయి సాగి రోకలిని వడిసి పట్టుకుంది. కుక్క భయంగానూ, కోపంగానూ గుర్రుమంది. ఒక్క పరుగున బయటికురికింది. కాని వెంకటి విసిరిన రోకలి దాని ఉరఃపంజరాన్ని బలంగా తాకింది.

దీనంగా చూసి కొద్దిసేపు కాళ్లు విలవిలలాడించి గుడ్లు తేలేసి అచేతనంగా వుండిపోయింది కుక్క.

వెంకటి అక్కణ్ణుంచీ కదిలి మంచం మీద కూర్చున్నాడు. ఏదో ఉపశమనం పొందినట్టుగా అనిపించింది. బీడీ వెలిగించి తేలికగా దమ్ములాగాడు.

*ఆంధ్రజ్యోతి వారపత్రిక, 20 సెప్టెంబర్ 1991*

